క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

పత్తికొండ రూరల్ : పత్తికొండ నియోజకవర్గ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోషియేషన్ తాలూకా అధ్యక్షుడిగా షేక్ రియాజ్ బాషా, కార్యదర్శిగా టి.భరత్, కోశాధికారిగా జిలానీ బాషా, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా దివాకర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వెంకటేష్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆంజినేయులు నాయక్ తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు షేక్ రియాజ్ బాషా పేర్కొన్నారు.

దేవనకొండలో సినీ నటుడు సుమన్ సందడి



దేవనకొండలో పర్యటిస్తున్న సినీ నటుడు సుమన్

దేవనకొండ: మండలకేంద్రమైన దేవనకొండలో సినీ నటుడు సుమన్ సోమవారం సందడి చేశారు. పత్తికొండలో ఓ దుకాణం ప్రారంభోత్సవాన్ని పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణంలో దేవనకొండకు వచ్చారు. ఇక్కడి అభిమానులతో ఫొటోలకు ఫోజులిచ్చారు. సుమన్‌ను చూసేందుకు పెద్ద ఎత్తున అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. దీంతో కాసేపు సందడి నెలకొంది.

అనారోగ్యంతో హెచ్‌ఎం మృతి



రామయ్య (ఫైల్)

తుగ్గలి: మండలంలోని రాతన గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం రామయ్య (61) అనారోగ్యంతో మృతి చెందారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ను చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు రెండు రోజుల క్రితం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సంజామలకు చెందిన రామయ్యకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. హెచ్‌ఎం మృతి పట్ల ఎంఈఓలు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

చదువులో రాణించాలి



కిట్లు అందుకున్న విద్యార్థులతో గ్రామ పెద్దలు

హొళగుంద: చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని వందవాగిలి కన్నడ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం శేషాద్రి, గ్రామ పెద్దలు శేషన్న, మాజీ సొసైటీ చైర్మన్ మల్లికార్జున విద్యార్థులకు సూచించారు. సోమవారం పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు స్టుడెంట్ కిట్‌ను అందజేశారు. పాఠశాలలో 1–7వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, టై బెల్ట్‌లు ఇచ్చినట్లు హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు ఈరన్న, జంబునాథ, పుమత్రిబాయి, గ్రామపెద్దలు నాగప్ప, అబ్దుల్లారాజన్న, జీర బసవ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ-1గా సత్యనారాయణ



ఎంఈఓలను సన్మానిస్తున్న ప్రైవేటు స్కూల్ టీచర్లు

హొళగుంద: హొళగుంద మండల విద్యాధికారి-1గా సత్యనారాయణ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇంతకు ముందు ఇక్కడే విధులు నిర్వహిస్తున్న ఆయన ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు. అయితే కొన్ని కారణాల వల్ల పదోన్నతి ప్రక్రియను నిలిపి వేసిన ఉన్నతాధికారులు యథాస్థానానికి పంపించారు. దీంతో సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓ-1గా సత్యనారాయణతో పాటు ఎంఈఓ-2 జగన్నాథంను హొళగుంద మండల ప్రైవేట పాఠశాల హెచ్‌ఎంలు గోపినాథ్, మల్లికార్జున, హబీబుల్లా, లక్ష్మన్న, వీరేష్, షేక్షావలి తదితరులు సన్మానించారు.

ఈరన్న స్వామికి అభిషేక పూజలు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రంలో భక్తులతో సందడి నెలకొంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. కొందరు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

బాల్యం.. మోయలేని భారం

- ఏటా పెరుగుతున్న పుస్తకాలు
- వయసుకు మించిన భారంతో ఎదుగుదలకు ఆటంకం
- ఆరోగ్య సమస్యలు వస్తాయంటున్న వైద్యులు



ఆలూరు రూరల్: విద్యార్థులకు పుస్తకాల భారం శాపంగా మారింది. ఏటా పై తరగతికి వెళ్తుంటే.. పుస్తకాల సంఖ్య కూడా దానికి తగ్గట్టుగానే పెరుగుతోంది. పుస్తకాల భారం తగ్గించాలని 2006లో చట్టం చేసినా అమలుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదు. ప్రైవేటు స్కూళ్లలో అయితే పుస్తకాలను మోస్తూ పిల్లలు పడే బాధలు వర్ణనాతీతం. బ్యాగునిండా పుస్తకాలతో మూడు నాలుగు అంతస్తుల మెట్లు ఎక్కేందుకు అవస్థలు పడుతున్నారు.

అమలుకు నోచుకోని చట్టం

పుస్తకాల భారాన్ని తగ్గించాలని ప్రభుత్వం 2006లోనే చట్టం చేసినా అమలుకు నోచుకోవడం లేదు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు స్కూల్ బ్యాగులు మోయకూడదు. మిగిలిన తరగతులకు సంబంధించి విద్యార్థి శరీర బరువులో పదో వంతు ఉండాలి. ప్రతి పాఠశాలలో ఆ పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల పుస్తకాలకు లాకర్లు ఏర్పాటు చేయాలి. ఏ రోజు పుస్తకాలు ఆరోజు ఇవ్వాలని తల్లిదండ్రులకు మార్గదర్శకాలు ఇవ్వాలి. ఇలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయకపోతే.. నిబంధనలు పాటించకపోతే పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు.

ప్రైవేటుగా పుస్తకాలతో అదనపు భారం

ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు విధిగా ప్రభుత్వం ముద్రించిన పాఠ్యపుస్తకాలతోనే విద్యార్థులు పాఠాలు బోధించాలి. స్టేట్, సీబీఎస్‌ఈ సిలబస్ మినహా మరే ఇతర పాఠ్యాంశాలను బోధించరాదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. అయితే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఐఐటీ కోచింగ్, స్మార్ట్ క్లాసుల పేరుతో ప్రైవేటు ముద్రణ సంస్థల నుంచి పుస్తకాలను కొనుగోలు చేయాల్సిందిగా తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. దీంతో విద్యార్థులకు మరింత భారం పెరుగుతోంది.

అనవసమైనవే ఎక్కువ

ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 59 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 10,736 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరు సబ్జెక్టులకు ఆరు పాఠ్యపుస్తకాలు, మరో ఆరు నోటు బుక్స్, కాపీ రైట్‌కు సంబంధించి నాలుగు పుస్తకాలు ఉంటాయి. ప్రైవేటు పాఠశాలలు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. తల్లిదండ్రులపై ఫీజులు, విద్యార్థులపై పుస్తకాల భారం మోపుతున్నాయి. ఒకటో తరగతి చదివే విద్యార్థికి సాధారణంగా 12 నుంచి 14 పుస్తకాలు ఉండాలి. కానీ 32 నుంచి 34 పుస్తకాలు ఉంటున్నాయి. ప్రింటెడ్ కాపీరైట్, ప్రింటెడ్ కలర్ కాంపోజింగ్, హోం, స్కూల్ ఎక్సర్‌సైజ్, రైటింగ్ ఇంప్రూమెంట్, లాంగ్వేజ్ డిక్షనరీ, డ్రాయింగ్ తదితర పుస్తకాలు అదనంగా జోడిస్తున్నారు. అనవసరమైన పుస్తకాలు మోస్తున్న చిన్నారుల వెన్నెముకపై తీవ్ర ప్రభావం పడి ఎదుగుదల లోపించే ప్రమాదం ఉంది.

నిబంధనలు బేఖాతరు

ప్రతి ఏటా డీఈఓ ద్వారా వార్షిక విద్యా ప్రణాళిక విడుదలవుతుంది. పాఠ్యాంశాలు, పరీక్ష, సాంస్కృతిక, ఆరోగ్య పరిరక్షణ కింద పలు అంశాలతో పట్టిక రూపొందించాల్సి ఉన్నప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారు. ప్రైవేటు పాఠశాలల కోసం ప్రత్యేక నిబంధనలతో పట్టిక విడుదల చేసి ఆయా పాఠశాలల్లో రోజువారీగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై నిరంతరం తనిఖీ చేయాల్సి ఉండగా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు.

వైద్య నిపుణుల సూచనలు

- పిల్లల్లో సాధారణంగా 15 ఏళ్లలోపే శరీరంలో వివిధ మార్పులు చోటు చేసుకుంటాయి. పాఠశాల వయసులో మోయాల్సిన భారం కంటే అధిక బరువు మోయడంతో వెన్నుముఖ సమస్యలు తలెత్తుతాయి.
- ఎక్కువ పుస్తకాలు ఉన్న పక్షంలో ఉపాధ్యాయుల సలహా మేరకు ఏ రోజు అవసరమైన పుస్తకాలు ఆ రోజున తీసుకెళ్లేలా తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలి.
- బ్యాగును రెండు భూజాలపై సమాన బరువుతో తగిలించుకోవాలి. ఒక వైపు తగిలించుకుంటే భుజం, మెడ నొప్పి వస్తుంది.
- నిత్యం వ్యాయామం చేయడం వల్ల శారీరకపరమైన ఇబ్బందులు అధికమించవచ్చు.
- విద్యార్థి బరువులో పుస్తకాల బరువు మూడవ వంతు మించరాదు. ఉదాహరణకు 20 కిలో బరువు ఉన్న విద్యార్థి మూడు కిలోల పుస్తకాలు మోయాలి.

యాజమాన్యాల లాభాపేక్ష కోసమే



ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమ లాభాల కోసం అవసరం ఉన్నా, లేకున్నా విద్యార్థులపై పుస్తకాల భారాన్ని మోపుతున్నాయి. విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవ హరిస్తున్నారు. తల్లిదండ్రుల జేబులకు చిల్లుపడడంతో పాటు విద్యార్థులకు అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రతి విద్యార్థికి లాకర్‌లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. – **మునిస్వామి, పీడీఎస్‌యూ తాలుకా కార్యదర్శి, ఆలూరు**

మెడ, వెన్ను నొప్పులొస్తాయి



పిల్లలు అధిక బరువుతో ఉన్న పుస్తకాల బ్యాగులు మోయడం వల్ల వెన్ను, మెడ నొప్పులు రావడమే కాకుండా భవిష్యత్తులో ఒంగిపోయే అవకాశం ఉంది. ఆశించిన శరీర పెరుగుదల ఉండదు. భుజాలపై అధిక బరువు మోయడంతో వెన్నుపూసపై బరువుపడి త్వరగా అలసిపోతారు. కండరాలపై కూడా ప్రభావం చూపుతుంది. వీలైనంత వరకు తక్కువ బరువు ఉన్న బ్యాగులు మోయడం మంచిది. – **వాహిద్, డాక్టర్, ఆలూరు సీహెచ్‌సీ**

పొంచి ఉన్న ప్రమాదం



కటికె వీధిలో కంచె లేకుండా ప్రమాదకరంగా ఉన్న 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్

ఆలూరు రూరల్: పట్టణంలోని నడిబొడ్డులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం పొంచి ఉంది. ఏ మాత్రం అదమరిచినా ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోయే ప్రమాదం ఉంది. నిత్యం ప్రజలు తిరిగే ప్రదేశాలైన తేరు బజారు, కటికే వీధిలో ఉన్న హై ఓల్టేజ్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచే లేకపోవడంతో ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులు వాటిని తాకే అవకాశం ఉంది. స్థానిక తేరు బజారులో పక్కనే ఉన్న వారపు సంతకు ప్రజలు నిత్యం వస్తూపోతుంటారు. రద్దీగా ఉండే ప్రదేశంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచే వేయకుండా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. అలాగే కటికే వీధిలోని రోడ్డుకు ఆనుకొని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచేలేకపోవడంతో అత్యంత ప్రమాదకరంగా మారింది. స్థానిక పాత బస్టాండులోని ట్రాన్స్‌ఫార్మర్ కట్ట పగుళ్లు ఇచ్చింది. బళ్లారి రోడ్డులోని పశువుల ఆస్పత్రి సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ స్తంభంపై భాగం చీలిపోయి కూలేందుకు సిద్ధంగా ఉన్నా ఆ శాఖ అధికారులకు కనిపించడం లేదు. ప్రమాదం సంభవించక ముందే అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు కంచే ఏర్పాటు చేయాలని పట్టణవాసులు వాపోతున్నారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక



కె.శశికళ,



హుల్తెప్ప,



విష్ణువర్ధన్

ఆలూరు: గ్రామసచివాలయంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా జాయింట్ సెక్రటరీ ఎస్.సురేష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ పంచాయతీ కార్యదర్శుల హక్కుల సాధనకోసం కార్యవర్గం కృషి చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరు కావాలసిన బిల్లులు, ఉద్యోగ భద్రత, జీత బత్యాలు తదితర అంశాలను సాధించుకోవాలన్నారు. ఆలూరు నియోజకవర్గ గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షురాలిగా కె.శశికళ, కార్యదర్శిగా హుల్తెప్ప, కోశాధికారిగా విష్ణువర్ధన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.రాజన్న ఎన్నికయ్యారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



ఆలూరు మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష రాసి బయటికి వస్తున్న విద్యార్థులు

ఆలూరు రూరల్: ఏపీ మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతిలో ఖాళీ సీట్ల భర్తీకి సోమవారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 7వ తరగతిలో 12 సీట్లు, 8వ తరగతిలో 12 సీట్లు, 9వ తరగతిలో 23 సీట్ల భర్తీకి ఈ నెల 16న నోటిఫికేషన్ విడదల చేశారు. 47 సీట్ల కోసం 222 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష రాసే విద్యార్థులకు 5 గదులు కేటాయించి పరీక్ష నిర్వహించారు. ప్రవేశ పరీక్షకు 212 మంది విద్యార్థులు హాజరుకాగా..10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ రాఘవరావు వెల్లడించారు. 9వ తరగతికి 72 మంది దరఖాస్తు చేసుకోగా 72 మంది హాజరయ్యారని చెప్పారు. క్యాస్ట్ కేటగిరీ, వచ్చిన మార్కుల ఆధారంగా వారం లోగా సీట్లను కేటాయిస్తామని తెలిపారు.

ఫీజులో రాయితీ కల్పించాలి



ఎంఈఓకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

పత్తికొండ రూరల్ : ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 60 శాతం ఫీజు రాయితీ కల్పించాలని ఏపీయూడబ్ల్యూజే తాలూకా అధ్యక్షుడు సాలురంగడు కోరారు. సోమవారం ఎంఈఓ గాజుల రమేష్‌కు యూనియన్ తరఫున వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అక్రిడిటేషన్‌తో సంబంధం లేకుండా ఫీజు రాయితీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు రంగన్న, హనుమంతు, గిడ్డయ్య పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 60 శాతం ఫీజు రాయితీ కల్పించాలని ఏపీయుడబ్ల్యూజే నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంఈఓ–2 రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. యూనియన్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం జర్నలిస్టుల పిల్లలకు అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో రాయితీ కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు అమీర్, రాజన్న, మారెన్న, శేఖర్, దస్తగిరి పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదివే జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో వందశాతం రాయితీ కల్పించాలని కోరుతూ ఆలూరు తాలూకా ఏపీడబ్ల్యూజే నాయకులు సోమవారం ఏంఈఓ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. గతంలో మాదిరిగానే ఈ విద్యాసంవత్సరంలో కూడా ప్రైవేటు పాఠశాలల్లో చదివే జర్నలిస్టుల పిల్లలకు వందశాతం ఫీజు రాయితీ కల్పించాలన్నారు. ఏపీడబ్ల్యూజే జిల్లా నాయకులు స్వరూప్, చంద్రమోహన్, తాలూకా అధ్యక్షుడు సురేష్, మండల అధ్యక్షులు గోపాల్ తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరగాళ్ల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెల్దుర్తి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం ఆర్‌బీఐ, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ వర్క్ షాప్‌లో పాల్గొని మాట్లాడారు. బ్యాంకుల ద్వారా కల్పిస్తున్న సౌకర్యాలు, డిపాజిట్లు, పలు రకాల రుణాల పరిమితి గురించి వివరించారు. యూనియన్ బ్యాంక్ అధికారి వెంకటేశ్వరనాయక్, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆంజనేయులు, మేనేజర్ అశోక్‌కుమార్, రిసోర్స్‌పర్సన్‌లు నబిరసూల్, మాధవకృష్ణ, శ్రీరాములు పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

తుగ్గలి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అందించే అర్జీలను సత్వరం పరిష్కరించాలని తహసీల్దార్ షర్మిల ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కారం వేదిక నిర్వహించారు. అన్ని విభాగాలను సమన్వయం చేసుకుని ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు.

నేడు పంచాయతీ మార్కెట్లకు వేలాలు

మద్దికెర : స్థానిక పంచాయతీకి సంబంధించిన దినసరి, బస్టాండు, వారం మార్కెట్ వేలాలను మంగళవారం ఉదయం 11 గంటలకు కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు సర్పంచ్ సుహాసిని, ఈఓఆర్డీ మద్దిలేటి స్వామి సోమవారం తెలిపారు. పాల్గొనే వారు విధిగా ధరావత్తు చెల్లించాలన్నారు.

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ సీటు ఇవ్వాలి

మద్దికెర : కేజీబీవీ, గురుకులాల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీట్లు ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి అరుణ్‌కుమార్ కోరారు. జిల్లా కమిటీ పిలుపు మేరకు డిమాండ్లతో వినతిపత్రాన్ని సోమవారం తహసీల్దార్ రజాక్‌వలికి అందజేశారు. వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు విద్యను అందించాలని హాస్టల్ సౌకర్యంతో ఏర్పాటు చేసిన కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో సీట్లు రాకపోవడంతో విద్యార్థులు వలసబాట పడుతున్నారన్నారు. విద్యమీద మక్కువతో తల్లిదండ్రుల వెంబడి వలసలు పోకుండా వుండేందుకు కేజీబీవీల్లో దరఖాస్తు చేసుకుంటే కేవలం 40 సీట్లకే పరిమితం చేయడం భావ్యం కాదన్నారు. కావున ప్రభుత్వం ప్రతి విద్యార్థికి సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు. తిప్పన్న, సాయికిరణ్, సాగర్, వేణు, జస్వంత్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

వెల్దుర్తి(కృష్ణగిరి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం వెల్దుర్తి సమీపంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా మద్యం సేవిస్తున్న మందుబాబులకు ట్రీట్‌మెంట్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. రహదారుల పక్కనే తాగడం వల్ల రహదారుల్లో వెళ్లే వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. మద్యం తాగి వాహనాలపై వెళ్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. మరోసారి రోడ్డు పక్కన మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ



కురువ వీరేశప్పను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కురువ వీరేశప్ప కాలికి ఇన్ఫెక్షన్ కావడంతో బళ్లారిలోని ఓ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకొని గ్రామానికి తిరిగొచ్చారు. విషయం తెలుసుకున్న ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి సోమవారం గూళ్యం గ్రామానికి చేరుకొని కురువ వీరేశప్పను పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకురాలు, బళ్లారి మాజీ మేయర్ మొలగవల్లి శశికళ, నాయకులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన రైతు మృతి



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ముక్కెల్లకు చెందిన రైతు రాజశేఖర్ (27) మృతి చెందాడు. పొలం పనులు పూర్తి చేసుకుని ఆదివారం సాయంత్రం వేసుకుని ఇంటికి వెళ్లేందుకు ఎద్దుల బండి కడుతుండగా అదే సమయంలో బొందిమడుగుల నుంచి పత్తికొండ వైపు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజశేఖర్ తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ కోలుకోలేక అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు సోమవారం తుగ్గలి పోలీసులు తెలిపారు. కాగా మృతుడి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పరామర్శించారు. సోమవారం కర్నూలు ఆసుపత్రికి వెళ్లి రాజశేఖర్ మృతదేహాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చెరుకులపాడుకు చెందిన రాము, హరిప్రసాద్, పుల్లయ్యను ఆమె పరామర్శించారు.

నీట్ అవకతవకలపై నిగ్గు తేల్చాలి

ఆదోని సెంట్రల్: నీట్ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ రాష్ట్ర నాయకులు తిరుమలేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ముందు పీడీఎస్ఓ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవాలి



కంబాలపాడు ఎస్సీ హాస్టల్‌లో అల్పాహారాన్ని పరిశీలిస్తున్న ఏఎస్‌డబ్ల్యూఓ బాబు

కృష్ణగిరి: హాస్టళ్లలో ఉండే విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవాలని పత్తికొండ ఏఎస్‌డబ్ల్యూఓ బాబు వార్డెన్‌లకు సూచించారు. మండలంలోని కంబాలపాడు, ఎరుకలచెర్వు గ్రామాల్లోని ఎస్సీ హాస్టళ్లను సోమవారం పరిశీలించి పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉదయం విద్యార్థులు తింటున్న అల్పాహారాన్ని రుచి చూశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ లక్ష్యం కోసం బాగా చదవాలని విద్యార్థులకు సూచించారు. వార్డెన్‌తో మాట్లాడుతూ.. హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థుల ఆరోగ్యంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని చెప్పారు. కార్యక్రమంలో వార్డెన్‌లు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో సీట్లు పెంచాలి



తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టికి వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

దేవనకొండ: ప్రభుత్వ విద్యాసంస్థలైన గురుకుల, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో సీట్లు పెంచాలని, దేవనకొండలో మూతబడిన ప్రభుత్వ డీఎన్‌టీ వసతిగృహాన్ని పునఃప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శరత్‌కుమార్ కోరారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టికి వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ కరువు, కాటకాలతో సతమతమవుతున్న కర్నూలు జిల్లా అత్యంత వెనకబడిన ప్రాంతమన్నారు. ఇక్కడ రెక్కాడితేకానీ డొక్కాడని పరిస్థితి ఉందని, ఉపాధి లభించక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారన్నారు. ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే సందర్భంలో వారి పిల్లలను ఇంటి దగ్గరే వదిలి వెళ్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నా ఉండేందుకు వసతి కరువయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేవనకొండలో ఉన్న ఒకే ఒక డీఎన్‌టీ హాస్టల్ నిర్వహణ లోపంతో మూసి వేయించారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు మధు, భాస్కర్, నాయకులు శశి, మహేష్, రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

తుగ్గలి : వాతావరణ మార్పులతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త తొలగింపు, డ్రైనేజీల్లో పూడిక తీయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించి ఫాగింగ్ చేయాలని, తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థులు భోజనానికి ముందు చేతులు కడిగేలా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా డయేరియా ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమంతు, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ హనుమంతు, పగిడిరాయి పీహెచ్‌సీ వైద్యాధికారి మినాజ్‌పాషా, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ పాల్గొన్నారు.

మద్దికెర : వైద్యసిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేయాలని ఎంపీడీఓ అలివేలమ్మ, మండల మెడికల్ ఆఫీసర్ రాగిణి తెలిపారు. సోమవారం స్టాప్ డయేరియా అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వాతావరణ మార్పులు వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ముందుజాగ్రత్తలు తీసుకోవడం మంచిదన్నారు. ఎంఈఓ రంగస్వామి, ఏఈ మయాంక్, ఆయా గ్రామాల కార్యదర్శులు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ రామారావు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా అతిసార నియంత్రణపై వైద్యారోగ్యశాఖ, గ్రామపంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో కుళాయి పైపుల లీకేజీతో నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. వైద్యాధికారి అరుణ్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యురాలు సుజాత, ఇన్‌చార్జ్ ఈఓఆర్‌డీ మునిస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మహబూబ్‌ఖాన్, ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి, మలేరియా సబ్‌యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కృష్ణగిరి: మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, ముఖ్యంగా డయేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం హెల్త్, ఐసీడీఎస్, విద్యా, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కుళాయిల నీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. డాక్టర్ శ్రీవాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరినాథ్, ఎంఈఓ సునంద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య కార్యకర్తలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.